# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీ లో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు.**
2. **ఉన్నత విద్యాభివృద్ధికి కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలు అవసరమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడుల్లో రేర్ ఎర్త్ కారిడార్లు అభివృద్ధి చేసేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ప్రారంభించామని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి వెల్లడించారు.**
4. **విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.**

==========================

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం బీచ్ రోడ్డు లో నగర కవాతును నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన నౌకాదళ ఆపరేషన్ డెమోలో హెలికాప్టర్లు, యుద్ధవిమానాలు, యుద్ధ నౌకల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మెరైన్ కమాండోల సాహసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.. పేరేడ్ అనంతరం నిర్వహించిన సభలో గవర్నర్ మాట్లాడుతూ,

వాయిస్ 35 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ -2026లో పాల్గొంటారు. రాష్ట్రాన్ని సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఏఐ, క్వాంటం సాంకేతికత, సైబర్ భద్రత రంగాల్లో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించేందుకు పలు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. ఈ సందర్భంగా అంతర్జాతీయ సంస్థలు, పారిశ్రామిక వేత్తలతో పెట్టుబడులు, సాంకేతిక సహకారం అంశాలపై ముఖ్యమంత్రి చర్చిస్తారు. సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు.

-------------------------

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వీబీజీ రామ్ జీ పథకం కింద పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వీబీ జీ రామ్ జీ పథకం అమలుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్న ఈ పథకాన్ని గ్రామీణ స్థాయిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులతో అనుసంధానించాలని పేర్కొన్నారు. డిమాండ్ డ్రివెన్ పథకంగా వీబీ జీ రామ్ జీ కింద రాష్ట్రానికి అవసరమైన పనులు చేపట్టేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

---------------------------

ఉన్నత విద్యాభివృద్ధికి కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలు ఎంతో అవసరమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన భారత విశ్వవిద్యాలయాల సమాఖ్య సెంట్రల్ జోన్ సదస్సులో గవర్నర్ నిన్న పాల్గొన్నారు. ఆరు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు చెందిన 108 మంది ఉపకులపతులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, నైతికత, భారతీయ విలువలను ప్రతిబింబించేలా స్వదేశీ కృత్రిమ మేధ – ఏఐ పరిష్కారాలను రూపొందించేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో సాంకేతిక పరిణామక్రమం ద్వారా 'జైజవాన్– జైకిసాన్'లకు అదనంగా 'జై విజ్ఞాన్.. జై అనుసంధాన్'లు వచ్చాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంత పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు పి.నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజధానిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు, ప్రపంచ స్థాయి సంస్థలను అమరావతికి తీసుకురావడంపై సమావేశంలో చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ...

వాయిస్ 31 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడుల్లో రేర్ ఎర్త్ కారిడార్లు అభివృద్ధికి 7,280 కోట్ల రూపాయలతో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ప్రారంభించామని కేంద్ర గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి వెల్లడించారు. భారత వాణిజ్య, పరిశ్రమల సంఘాల సమాఖ్య – ఫిక్కీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన సదస్సులో మంత్రి నిన్న పాల్గొని మాట్లాడుతూ, వాహన, పునరుత్పాదక ఇంధన రంగం, ఎలక్ట్రానిక్స్‌కు అత్యంత కీలకంగా మారిన అరుదైన భూ అయస్కాంతాల ఉత్పత్తి ఈ ఏడాదిలోనే దేశంలో ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇందుకవసరమైన కీలక ఖనిజాలను వెలికితీయడంతో పాటు ఈ–వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారానూ సమీకరిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు. ఈ నెల 23 నుంచి ఇంటర్ పరీక్షల నేపథ్యంలో తాడేపల్లిలోని సంక్షేమ కార్యాలయం నుంచి అంబేద్కర్ గురుకులాల ఇంటర్ విద్యార్థులతో మంత్రి దృశ్య మాధ్యమం విధానంలో నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి

పరీక్షల పట్ల భయం పోగొట్టేలా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రైతులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ధరల స్థిరీకరణ పేరిట నిధులు కేటాయించినా తగిన రీతిలో ఖర్చు చేయలేదని ఆరోపించారు.

వాయిస్ 24 సెకన్లు

-------------------------

తెలంగాణలో త్వరలోనే ఓటరు జాబితా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ –ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి –సీఈవో సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ లోని ఎన్నిక కార్యాలయంలో మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదారాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 50 మంది ఎన్నికల నమోదు అధికారులు –ఈఆర్‌వోలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఓటరు జాబితా సవరణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులది కీలక పాత్ర అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చడంతోపాటు అనర్హుల పేర్లను చట్టబద్ధంగా తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికల జాబితా సవరణలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

-------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని ఇది పశ్చిమ–వాయవ్య దిశగా శ్రీలంక వైపుగా కదులుతూ ఈ రోజు బలహీనపడొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ఈ రోజు పలు ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తుందని తెలిపింది.

-------------------------

సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించే విషయంలో అవగాహన కల్పించేందుకు ఈ రోజు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నారు. సామాజిక, ఆర్థిక అంతరాలతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా పౌరులందరికీ సమాన అవకాశాలు, వనరులు అందాలనే లక్ష్యంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు 2009వ సంవత్సరం నుండి ప్రతిఏటా ఫిబ్రవరి 20వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. చట్ట పరంగా ఎటువంటి వివక్షత తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమ న్యాయం అందించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

=====================